## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మండలంలోని గౌడవెళ్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ మౌలాలి తెలిపారు. గౌడవెళ్లి సబ్‌స్టేషన్ పరిధిలో బాసిరేగడి 11కేవీ ఫీడర్ల పరిధిలోని అన్ని పరిశ్రమలకు ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ప్రకటించారు.

శామీర్‌పేట్: శామీర్‌పేట సబ్ స్టేషన్ పరిధిలోని 33/11కేవీలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని శామీర్‌పేట విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం, అంతాయిపల్లి, ఉప్పర్‌పల్లి, శామీర్‌పేట, తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు వివరించారు.

మేడ్చల్‌లో...

కండ్లకోయ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని 132కేవీలో అత్యవసర మరమ్మతుల కారణంగా బండమాదారం, మేడ్చల్‌టౌన్, పూడూరు, మునీరాబాద్, రాజబొల్లారం, మెడిసిటీ, రావల్‌కోల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు వివరించారు.

## ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు

రోడ్డును చదును చేయించిన జేఏసీ సభ్యులు



ఘట్‌కేసర్: పట్టణంలోని బస్సు ప్రయాణ ప్రాంగణం నుంచి రైల్వేగేటు వరకు ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం చదును చేయించారు. ఏడాదిన్నర కాలంగా రైల్వే వంతెన పనులు సాఫీగా జరగడానికి రోడ్డు మూసివేశారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్లడానికి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్డును ఏర్పాటు చేశామని జేఏసీ సభ్యులు పేర్కొన్నారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా పూలే జయంతి వేడుకలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా జరిగాయి. జిల్లా అధికారులు, ఉద్యోగులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ పూలే చేసిన సామాజిక సేవలను వారు స్మరించుకున్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ జిల్లా అధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ జిల్లా అధికారి వినోద్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు, వివిధ శాఖల అధికారులు ఎల్.రామ్మోహన్, వెంకట నర్సయ్య, అధ్యక్షులు, మేడ్చల్ జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## తడి, తాలు లేని ధాన్యాన్ని తీసుకురావాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: తడి,తాలు లేని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా రైతులను చైతన్య పరచాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ।ధాన్యం సేకరణ।పై కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, రైస్ మిల్లుల యజమానులతో సంబంధిత శాఖల జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సుగుణబాయి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రకళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో మన జిల్లాలో కొనుగోలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒకే కేంద్రంలో సన్నవడ్లు, దొడ్డు వడ్లకు ప్రత్యేక విభాగాలను ముందస్తుగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు రిజిస్టర్లను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవటంతో పాటు వారు విక్రయించిన ధాన్యం డబ్బులు 48 గంటలలో నేరుగా వారి ఖాతాలో జమ చేయాలన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

పోచారం: రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తేనుగూడెంలో రహదారి పక్కన ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడిపోయి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు 108కు సమాచారం ఇచ్చారు. పరిశీలించిన సిబ్బంది మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు భిక్షాటన చేసేవాడని స్థానికులు చెబుతున్నారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

# అగ్గిపడితే బుగ్గే !

అందుబాటులో లేని అగ్నిమాపక కేంద్రం

- దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న ప్రజలు
- పట్టించుకోని ప్రభుత్వం

వేసవికాలం ప్రారంభంకావడంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. దీనికి అగ్గి తోడైతే సర్వస్వం కోల్పోవాల్సి వస్తుందని, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో ఫైరింజన్లు అందుబాటులో లేకపోవడంతో ప్రతి ఏటా అగ్ని ప్రమాదాలు జరిగి, లక్షల విలువైన ఆస్తులు బుగ్గిపాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఘట్‌కేసర్ బైపాస్ చౌరస్తాలో అగ్నికి ఆహుతవుతున్న కారు (ఫైల్)

ఘట్‌కేసర్: ఉమ్మడి ఘట్‌కేసర్ మండలం నారపల్లిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. అధికారులు సరైన సమయంలో స్పందించకపోవడంతో అది కార్యరూపం దాల్చలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్, ఇన్ఫోసిస్, రహేజా తదితర అంతర్జాతీయ వ్యాపార సంస్థలు, మేథా, దయానోలాంటి పరిశ్రమలు ఉమ్మడి మండలంలో ఉన్నాయి. ఇవే కాకుండా గడ్డివాములు, వాహనాలకు మంటలు అంటుకుని కాలిపోతున్నాయి. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఫైరింజన్ ఘటనా స్థలానికి చేరుకునేలోపే ఆస్తులు కాలిబూడిదవుతున్నాయి. దీంతో బాధితులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

**ఆస్తులు నష్టపోతున్న బాధితులు...**

గతంలో ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ గోదాములో మంటలు అంటుకోవడంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. అలాగే రైల్వేస్టేషన్ రోడ్డులో కారుకు మంటలు అంటుకున్నాయి. మర్పల్లిగూడ, ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డులోని ప్లాస్టిక్ దుకాణాల్లో ప్రమాదం జరిగింది. ఘట్‌కేసర్–ఘనాపూర్ సర్వీస్ రోడ్డులో కారుకు మంటలు అంటుకుని దగ్ధమైంది.

◆ బొక్కొనిగూడ, ఏదులాబాద్‌లోని వ్యవసాయ క్షేత్రాల్లో గడ్డివాములకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని రైతులు లక్షలాది రూపాయలు నష్టపోయారు. పైసా పైసా కూడబెట్టి కొనుగోలు చేసిన ఆస్తులు కళ్లముందే అగ్గిపాలవుతుంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ప్రజలు ఉన్నారు. స్థానికంగా అగ్నిమాపకకేంద్రం లేకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు చెర్లపల్లి నుంచి ఫైరింజన్ వచ్చేలోగా మంటలు చేయి దాటిపోతున్నాయి.

◆ ఘట్‌కేసర్‌లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని దశాబ్దకాలంగా కోరుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి స్థానికంగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుతో ప్రజలకు మేలు..



మున్సిపాలిటీ ప్రజలకు ఫైరింజన్ అందుబాటులో లేకపోవడంతో అగ్నిప్రమాదం జరిగినప్పుడు విలువైన ఆస్తులకు మంటలు అంటుకుని బుగ్గిపాలవుతున్నాయి. స్థానికంగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుతో పరిసర ప్రాంతాల ప్రజలకు మేలు జరుగుతుంది. ఘట్‌కేసర్‌లో అగ్నిమాపకకేంద్రం ఏర్పాటు చేయాలి.

– తంగెళ్లపల్లి గోపాల్‌రావుశర్మ, ఎన్ఎఫ్‌సీనగర్

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించండి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

మేడ్చల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని మండల బీజేపీ నేతలు ఎంపీ ఈటలకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఎల్లంపేట్, సోమారం, రావల్‌కోల్, డబీల్‌పూర్, శ్రీరంగవరం, బండమాదారం తదితర గ్రామాల్లో సీసీరోడ్లు, హైమాస్ట్ లైట్లు, బీటీరోడ్లు, కమ్యూనిటీహాల్ నిర్మాణం వంటి పనుల కోసం నిధులు కేటాయించాలని ఎంపీని బీజేపీ నేతలు కోరారు. జగన్‌గౌడ్, శ్రీశైలంయాదవ్, దేవేందర్‌రెడ్డి, పుష్ప తదితరులున్నారు.

## స్లాట్ బుకింగ్ రద్దు చేయాలని ధర్నా

మేడ్చల్: ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అమలుచేస్తున్న స్లాట్ బుకింగ్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు శుక్రవారం ధర్నా నిర్వహించారు. స్లాట్ బుకింగ్‌లో అనేక ఇబ్బందులు వస్తున్నాయని, రద్దు చేయాలని డాక్యుమెంట్ రైటర్లు పేర్కొన్నారు. స్లాట్ బుకింగ్ పద్ధతితో కొత్త సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. చెక్ స్లిప్ విధానం కొనసాగిస్తూ స్లాట్ బుకింగ్ విధానాన్ని మార్చాలన్నారు. ధర్నా అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రం ఇస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న తోటకూర వజ్రేష్‌యాదవ్

కీసర: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. కీసర బోగారంకు చెందిన ఆకుల సుభాష్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును శుక్రవారం తోటకూర వజ్రేష్‌యాదవ్ చేతులమీదుగా అందజేశారు. కీసర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోలా కృష్ణయాదవ్, సేవాదళ్ అధ్యక్షులు జనగాం మహేంద్రభూపతి, బి-బ్లాక్ అధ్యక్షులు మహేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ హేమలతపర్వతాలు, నాయకులు మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో నిందితుడి రిమాండ్



మహమ్మద్ మొయిన్ షరీఫ్

ఘట్‌కేసర్: ఓ ఇంట్లో వెండి వస్తువులు చోరీచేసిన పాత నేరస్తుడిని ఘట్‌కేసర్ పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మేడపాటినగర్‌లో నివసించే సునీత ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి వచ్చి వెండి వస్తువులు అపహరించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా.. పోలీసుల దర్యాప్తులో మేడపాటినగర్‌కు చెందిన మహమ్మద్ మొయిన్ షరీఫ్ (23)గా తేలింది. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని చోరీ చేసిన వస్తువులను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. అతడు గతంలో పలు చోరీ కేసుల్లో నిందితుడని, పలుసార్లు జైలుకు కూడా వెళ్లొచ్చినట్లు పోలీసులు తెలిపారు.

## వ్యభిచార గృహంపై దాడి

నలుగురి అరెస్ట్

మల్కాజిగిరి: ఓ అపార్ట్‌మెంట్‌లో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు నిర్వాహకులతో పాటు ఇద్దరు విటులను మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. సాయినగర్‌లోని శ్రీసాయిరామ్ అపార్ట్‌మెంట్‌లో స్వప్న, నవనీత అనే మహిళలు ఫ్లాట్ అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో శుక్రవారం ఫ్లాట్‌పై దాడిచేసి స్వప్న, నవనీతతో పాటు ఆకుల తనీష్, పెనుమల కళ్యాణ్‌బాబులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2,930 నగదు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

# దశలవారీగా హామీలు అమలు చేస్తాం

ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ ఈటల

శామీర్‌పేట్: ఎన్నికల హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో దశలవారీగా అమలు చేస్తామని ప్రభుత్వ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్నం మహేందర్‌రెడ్డితో పాటు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌లు హాజరై నియోజకవర్గంలోని 389 మంది లబ్ధిదారులకు రూ.4 కోట్ల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పట్నం మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేదవర్గాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జైపాల్‌రెడ్డి తదితరులున్నారు.

# రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



జవహర్‌నగర్‌లో పాదయాత్రలో శ్రీకాంత్ యాదవ్, మాజీ మేయర్ శాంతి తదితరులు

జవహర్‌నగర్: రాజ్యాంగం విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్‌గాంధీ 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' నినాదానికి పిలుపునిచ్చినట్లు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజ్యాంగ రక్షణ పాదయాత్రను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా శ్రీకాంత్‌యాదవ్, మాజీ మేయర్ శాంతి, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్‌లు హాజరయ్యారు. సదానందం, భాస్కర్, వెంకటేష్, శ్రీనివాస్, రాజుయాదవ్, మిట్టు, దుర్గేష్, హైమద్ తదితరులున్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌రెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో 16వ వార్డు రాజ్‌సుఖ్‌నగర్ కాలనీ రోడ్డు నెంబర్- 8లో సీసీ రోడ్డు పనులను నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ సహకారంతో కాలనీలో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయన్నారు. మాజీ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, అన్నంరాజు సుమిత్రసురేష్, నాయకులు సతీష్‌గౌడ్, బాబురావు, కాలనీ అధ్యక్షుడు దాసు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రేత రిమాండ్



ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితుడు ఉమర్‌అలీ

మేడ్చల్: గంజాయిని అక్రమంగా రవాణ చేస్తున్న వ్యక్తిని మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నవనీత తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌కు చెందిన ఉమర్‌అలీ(27) నగరం నుంచి గంజాయి తీసుకొచ్చి సరఫరా చేయడానికి యత్నిస్తుండగా.. పోలీసులు దాడులు నిర్వహించి రావల్‌కోల్ కమాన్ వద్ద ఉమర్‌అలీని అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల విచారణలో నిందితుడి వద్ద 1.2 కిలోల గంజాయి లభ్యమైందని, నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో 'గావ్ చలో.. బస్తీ చలో ' !

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో 'గావ్ చలో.. బస్తీ చలో' కార్యక్రమాన్ని బీజేపీ నేతలు నిర్వహించారు. శుక్రవారం ముత్యాలమ్మ గుడి సమీపంలోని పరిసరాలను శుభ్రం చేశారు. ముఖ్యఅతిథిగా గిరిజన మోర్చా జాతీయ కార్యవర్గసభ్యుడు బిక్కునాథ్‌నాయక్ పాల్గొని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. బీజేపీ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, నాయకులు నర్సింగ్‌రావు, మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ తదితరులున్నారు.



అన్నోజిగూడలో పరిసరాలను శుభ్రం చేస్తున్న బీజేపీ నేతలు

# రూ.25 లక్షలతో అభివృద్ధి పనులు



అల్వాల్: వెంకటాపురం డివిజన్ సన్‌రైజ్ కాలనీలో రూ.25లక్షలతో నిర్మించనున్న బాక్స్‌డ్రైన్ పనులను శుక్రవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సబితాఅనీల్‌కిషోర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని చెప్పారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ బాక్స్‌డ్రైన్ పనులతో వర్షాకాలంలో వరద ముంపు సమస్య ఏర్పడిందన్నారు. నాయకులు అనీల్‌కిషోర్, విజయశేఖర్, పోతురాజు, మోసిన్, సురేష్, తదితరులున్నారు.

# ఘనంగా 'ఈసీఐఎల్' వ్యవస్థాపక దినోత్సవం



ఈసీఐఎల్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో సంస్థ సీఎండీ అనురాగ్‌కుమార్

కుషాయిగూడ: కార్మికులు, ఉద్యోగులంతా సమష్టిగా కృషిచేసి కేంద్ర ప్రభుత్వరంగ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)ను ఉన్నత స్థానంలో నిలపాలని ఈసీఐఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్‌కుమార్ అన్నారు. ఈసీఐఎల్ 58వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఈసీఐఎల్ ప్రధాన గేట్ వద్ద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఏఎస్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశరక్షణరంగం, పరిశోధనారంగాలకు ఈసీఐఎల్ అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇదంతా సమష్టి కృషితోనే సాధ్యమైందన్నారు. భవిష్యత్తులో సంస్థ అభ్యున్నతికి పాటుపడుతూ ఉన్నత స్థానాన్ని సొంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్మికులు, ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈసీఐఎల్ డైరెక్టర్ టెక్నికల్ కృష్ణకుమార్‌తో పాటుగా వివిధ విభాగాల అధికారులు, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని ఏపీ, తెలంగాణ పాఠశాల రీజనల్ డైరెక్టర్ ఆఫ్ టెక్నాలజీ కౌశిక్ రెడ్డి అన్నారు. బోడుప్పల్ శుభోదయకాలనీలోని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన కార్నివాల్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ వేడుకల్లో గన్‌షాట్, రాక్ క్లైమ్బింగ్, ట్రాంపోలిన్, రోబోటిక్స్, లాంగ్వేజ్ కార్నర్, ఫేస్‌మాస్క్ , కీ చైన్ పెయింటింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు చేసిన మ్యాజిక్ షో ఆహూతులను ఆకట్టుకుంది. పాఠశాల డైరెక్టర్ రూపారెడ్డి, రీజినల్ అకాడమీ కో– ఆర్డినేటర్ సునీత, ప్రిన్సిపాల్స్ సరిత విలియన్స్, నీలిమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే కృషి

ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంత్యుత్సవాలు

మేడ్చల్ జోన్ పరిధిలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఆయన చిత్రపటం, విగ్రహాలకు వివిధ పార్టీల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు.

– మేడ్చల్ జోన్ బృందం.



ఘట్‌కేసర్‌లో పావనీజంగయ్య, ముత్యాలుయదవ్ తదితరులు



జవహర్‌నగర్‌లో ..



కీసరలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో..



నివాళులర్పిస్తున్న పోచారం మున్సిపల్ అధికారులు



గుండ్లపోచంపల్లిలో బీజేపీ నాయకులు



మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద కాంగ్రెస్ నేతలు



కండ్లకోయలో మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి